# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 28-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై తీసుకునే చర్యలు సమానత్వం, బాధ్యత, న్యాయబద్ధంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
- 'పీఎం ఫ్యామిలీ కేర్ ట్రాకర్' పైలట్ ప్రాజెక్టును కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు.
- 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో గ్రామాలు కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.
- రాగల మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్, మధ్యప్రదేశ్ లో విస్తరించనున్నాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై తీసుకునే చర్యలు ఎల్లప్పుడూ సమానత్వం, బాధ్యత, న్యాయబద్ధతతో కూడి ఉండాలని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. సీషెల్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ పార్లమెంట్ ను ఉద్దేశించి ఆయన ఈరోజు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సాగే అభివృద్ధి అందరినీ కలుపుకొనిపోయేలా (Inclusive) ఉండాలని.. అలాగే అంతర్జాతీయ సంస్థలు నేటి ఆధునిక వాస్తవాలకు అద్దం పట్టేలా రూపాంతరం చెందాలని భారత్, సీషెల్స్ రెండు దేశాలూ బలంగా ఆకాంక్షిస్తున్నాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు. సీషెల్స్ దేశానికి ఎప్పుడూ ఒక ప్రత్యేక స్థానం ఉంటుందని, హిందూ మహాసముద్రం భారత్, సీషెల్స్ దేశాలను అనుసంధానిస్తోందని పేర్కొంటూ...

(వాయిస్...35 సెకన్లు)

సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించిన మొట్టమొదటి భారత ప్రధానమంత్రిగా ఈ గౌరవం దక్కడం తన అదృష్టమని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు తనకు సీషెల్స్ దేశపు అత్యున్నత పురస్కారమైన 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారైజన్' (Guardian of the Blue Horizon) అవార్డును ప్రదానం చేసినందుకు ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీకి, అక్కడి ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

సీషెల్స్ రాజధాని విక్టోరియాలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆ దేశ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ మధ్య నేడు ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అంతకుముందు ప్రధాని మోదీకి 'స్టేట్ హౌస్'లో అధ్యక్షుడు హెర్మినీ సమక్షంలో సైనిక దళాలు ఘనంగా 'గార్డ్ ఆఫ్ ఆనర్' సమర్పించాయి. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించేలా వ్యవసాయం, ఆర్థిక రంగం, అంతరిక్షం, ఆరోగ్య రంగాలలో పలు కీలక ఒప్పందాలు (MoUs) కుదిరాయి. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి మరియు హరిత వృద్ధి రంగాలలో ప్రధాని మోదీ కనబరిచిన నాయకత్వానికి గుర్తింపుగా.. సీషెల్స్ దేశపు అత్యున్నత పురస్కారమైన 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' (Guardian of the Blue Horizon) అవార్డును నరేంద్రమోదీకి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ.. ఈ పురస్కారం 140 కోట్ల మంది భారత

ప్రజలకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. హిందూ మహాసముద్రం భద్రత, సుస్థిరత ఉమ్మడి బాధ్యతని, ఇరు దేశాల రవాణా, డిజిటల్ కనెక్టివిటీని మరింత పెంచుతామని పేర్కొన్నారు. అలాగే.. ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు అత్యంత సమగ్రంగా, భవిష్యత్తు ప్రణాళికలతో సాగాయని సీషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్‌లోని గాంధీనగర్‌లో 'పీఎం ఫ్యామిలీ కేర్ ట్రాకర్' పైలట్ ప్రాజెక్టును కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. గర్భం దాల్చిన సమయం నుంచి బిడ్డకు 18 ఏళ్లు వచ్చే వరకు.. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ABHA ID)తో అనుసంధానించిన ఒక ప్రత్యేక ఐడీ ద్వారా లబ్ధిదారుల పూర్తి సమాచారాన్ని ఈ సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్ ట్రాక్ చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో దేశంలో ఆరోగ్య రంగం ఊహించని రీతిలో పురోగమించిందని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

గ్రామాల అభివృద్ధి ద్వారానే వికసిత్ భారత్-2047 లక్ష్యం సాధ్యమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 'రాష్ట్రీయ గ్రామీణ వికాస్ సమ్మేళన్'లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ కార్మికులకు జీవనోపాధి, భద్రత కల్పిస్తూనే, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు 'వికసిత్ భారత్ గ్రామీణ' పథకం కింద రాష్ట్రాల వాటాతో కలిపి 1.51 లక్షల కోట్ల రూపాయలకు పైగా నిధులను కేటాయించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం రక్షణ, విమానయాన రంగాల్లో స్వయంసమృద్ధి సాధిస్తూ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా ప్రసారమైన మన్ కి బాత్ మనసులోని మాట కార్యక్రమం 135వ సంచికలో ప్రధానమంత్రి ఈరోజు పలు విషయాలపై మాట్లాడారు. భారత్‌లోనే తయారైన 'సి-295' (C-295) రవాణా విమానం తొలి విమాన ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుందని ప్రధానమంత్రి వెల్లడించారు. ఇటీవలే కోల్‌కతాలో జరిగిన నౌకాదళ కార్యక్రమంలో పూర్తి స్వదేశీ సాంకేతికతతో రూపుదిద్దుకున్న ఐఎన్ఎస్ దునగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకలను నౌకాదళంలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 2వేల 500 కంటే ఎక్కువ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జరిగాయని మోదీ తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో.. బంగారం కొనుగోళ్లు తగ్గించాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తాను కోరానన్నారు. తన విజ్ఞప్తికి దేశ ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, అందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్…31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భూకంప విపత్తుతో అతలాకుతలమైన వెనిజువెలా దేశాన్ని ఆదుకునేందుకు భారతదేశం మానవతా దృక్పథంతో చేపట్టిన 'ఆపరేషన్ అమిస్టాడ్' (Operation Amistad) సహాయక సామాగ్రి అక్కడికి చేరుకుంది. భారత్ పంపిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర మందులు, వైద్య పరికరాలు వెనిజువెలాలో జరుగుతున్న భూకంప సహాయక చర్యలకు మరింత బలాన్నిస్తాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

'ఆపరేషన్ సిందూర్' లో వీరమరణం పొందిన ఆరుగురు భారత జవాన్ల అత్యున్నత త్యాగాన్ని ప్రభుత్వం ఇప్పుడే మొదటిసారిగా గుర్తించిందంటూ సామాజిక మాధ్యమాలు, కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న కథనాలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, అది పూర్తిగా సత్యదూరమని స్పష్టం చేసింది. దేశ రక్షణ కోసం పోరాడిన ఆ వీరజవాన్లకు దేశం ఎప్పుడో సముచిత గౌరవాన్ని అందించిందని రక్షణ శాఖ తెలిపింది. గతేడాది మే 11న నిర్వహించిన సమావేశంలోనే అప్పటి మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (DGMO) ఈ ఆరుగురు అమరవీరులకు నివాళులర్పించారని గుర్తుచేసింది.

====================

ఇంగ్లాండ్ లోని లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియా, భారత్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న టి20 క్రికెట్ ప్రపంచ కప్ లో టాస్ గెలిచిన భారత్ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది.
అలాగే.. ఐర్లాండ్ లోని బెల్ఫాస్ట్ మైదానం వేదికగా భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న చివరి టీ20 క్రికెట్ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ జట్టు 155 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన భారత జట్టు 7 ఓవర్లు పూర్తయ్యేసరికి 4 వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది.

====================

రాగల మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రం, గుజరాత్, మధ్యప్రదేశ్ లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోని కొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత ముందుకు సాగనున్నట్లు పేర్కొంది. రాగల రెండు రోజుల పాటు తెలంగాణ, కర్ణాటక, కొంకణ్, గోవా, ఒడిశా, విదర్భ, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

====================
====================